సాక్షి ఆదిలాబాద్
గురువారం । 18 । జూలై । 2024

పీరీల సందడి

జిల్లా వ్యాప్తంగా మొహర్రం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడన పీరీలు, డోలల సందడి కనిపించింది. - 9లో▸





గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం
నైరుతి ప్రభావంతో పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే శంకర్



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే శంకర్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చే రారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనను చూసి బీజేపీలో చేరేందుకు ఆయా పార్టీల నాయకులు ముందుకొస్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి'

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు జె.రాహుల్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రైవేట్ పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం, ఇతర వస్తువులు విక్రయిస్తున్నారని తెలిపారు. అలాగే ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

ఎదులాపురం: సీపీఐతో పాటు అనుబంధ సంఘాల బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నవ చేతన విజ్ఞాన సమితిలో బుధవారం రాష్ట్రంలోని ఆదిలాబాద్‌తో పాటు పలుజిల్లాల కార్యవర్గాల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలలన్నారు. ఇందులో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు నళినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, గోవర్ధన్, భూపతిరెడ్డి, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో బారులు తీరిన భక్తులు



విఠల్ రుక్మిణి ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి



'తొలి' పూజలు

తొలి ఏకాదశి సందర్భంగా జిల్లాలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మార్వాడీ ధర్మశాల వేంకటేశ్వర ఆలయం, శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం, మంగమఠం, రామాలయం, విఠల్‌రుక్మిణి ఆలయం, సత్యనారాయణ స్వామి ఆలయాలకు భక్తులు ఉదయం నుంచే తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. - ఎదులాపురం

నెగ్గేనా.. వీగేనా



కాంగ్రెస్ కౌన్సిలర్ ఇంటికి విప్ నోటీస్ అతికిస్తున్న ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.నగేశ్



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

- నేడు మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస సమావేశం
- జహీర్ రంజాని పదవి నిలిచేనా.. కోల్పోయేనా?
- తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేసిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్
- హస్తం పార్టీకి ప్రతిష్టాత్మకం.. పట్టు కోల్పోకుండా గులాబీ పార్టీ యత్నం.. కాషాయం పార్టీ మైండ్ గేమ్



జహీర్ రంజాని, మున్సిపల్ వైస్‌చైర్మన్

సాక్షి,ఆదిలాబాద్: మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానిపై అవిశ్వాసం నెగ్గుతుందా.. వీగుతుందా.. అనేది నేటితో తేలిపోనుంది. ఆయన తన పదవిని నిలుపుకుంటాడా.. కోల్పోతాడా అనేది స్పష్టం కానుంది. నెల క్రితం అవిశ్వాస తీర్మానానికి సంబంధించి పలువురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసు అందజేసినప్పటి నుంచి మొదలైన చర్చకు నేటితో ముగింపు పడనుంది. ఈ మేరకు ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో 2/3 వంతు కౌన్సిలర్లు పాల్గొని చేతులెత్తితే అవిశ్వాసం నెగ్గుతుంది. నిర్దేశిత సభ్యులు సమావేశానికి రాకపోతే వీగిపోయినట్టే.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విప్ జారీ..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు తమ పార్టీ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లకు విప్ జారీ చేశాయి. దీనికి సంబంధించి ప్రిసైడింగ్ ఆఫీసర్ వినోద్‌కుమార్‌కు ఆయా పార్టీలు సమాచారం అందజేశాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి 24 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు గెలిచారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. విచిత్రమేమిటంటే.. ప్రస్తుతం అవిశ్వాసం ఎదుర్కొంటున్న జహీర్ రంజాని కూడా బీఆర్‌ఎస్ నుంచే గెలుపొందారు. గులాబీ పార్టీ విప్ జారీ చేయడం ఇప్పుడు జహీర్ రంజానితో పాటు కాంగ్రెస్‌లో చేరిన మిగితా కౌన్సిలర్లకు కూడా వర్తిస్తుంది. ఇదిలా ఉంటే బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మూడు పార్టీల కౌన్సిలర్లు ఇప్పటికే క్యాంపులలో ఉన్నారు. వారు ఎక్కడ ఉన్నది కూడా తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ విప్ జారీ చేయడంతో నేటి మున్సిపల్ సమావేశానికి ప్రస్తుతం క్యాంపులో ఉన్న కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరమే. ఇక కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఐదు స్థానాల్లో గెలుపొందింది. అయితే ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి వైస్ చైర్మన్ జహీర్ రంజానితో పాటు పలువురు కౌన్సిలర్లు చేరడంతో ఆ పార్టీ బలం 13కు చేరింది. ఇక బీజేపీ నుంచి 11 మంది కౌన్సిలర్లు గెలిచారు. ప్రస్తుతం 9 మంది ఆ పార్టీలో ఉన్నారు. ఇదిలా ఉంటే ఆ పార్టీ తమ కౌన్సిలర్లకు ఇప్పటివరకు విప్ జారీ చేయలేదు. దీంతో బీజేపీ మైండ్ గేమ్ ఆడుతుందని చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశంలో ఆ పార్టీ కౌన్సిలర్లు వ్యవహరించే తీరు ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే మున్సిపల్ అవిశ్వాస నోటీసుకు సంబంధించి 33 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి కలెక్టర్‌కు అప్పట్లో ఇచ్చారు. అందులో బీఆర్‌ఎస్, బీజేపీతో పాటు స్వతంత్ర కౌన్సిలర్లు సంతకాలు చేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీజేపీకి చెందిన కౌన్సిలర్ మధు జైస్వాల్ అప్పట్లో సంతకాలు చేయలేదు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన కౌన్సిలర్ అంబకంటి అశోక్ గత అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబావుటా వేసిన ముఖ్య నేతలతో ఆయన ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశంలో ఆయనతో పాటు ఆ పార్టీ పరంగా గెలిచిన మిగతా కౌన్సిలర్లు ఎలా ముందుకెళ్తారనేది చూడాల్సిందే. ఇక బీఆర్‌ఎస్ నుంచి విప్ అధికారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అజయ్, కాంగ్రెస్ నుంచి పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ జి.నగేశ్‌కు అప్పగించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల ఇంటి గోడలపై విప్ నోటీసులను బుధవారం అతికించారు. కాగా, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు.

నేతలకు ప్రతిష్టాత్మకం..

వైస్‌చైర్మన్ జహీర్ రంజాని అవినీతి, అక్రమాల కారణంగానే గద్దె దించాలనుకుంటున్నామని బీఆర్‌ఎస్‌తో పాటు అవిశ్వాస నోటీసు అందజేసే రోజు కౌన్సిలర్లు పేర్కొన్నారు. కాగా రంజాని కాంగ్రెస్‌లో చేరిన తర్వాత ఇవి గుర్తుకొచ్చాయా అని హస్తం పార్టీ ఎదురు దాడి చేస్తుంది. కేవలం పార్టీ మారాడనే అక్కసుతోనే ఇలా వ్యవహరిస్తున్నారని, బీఆర్‌ఎస్ యత్నానికి బీజేపీ మద్దతు ఇవ్వడం ద్వారా ఆ పార్టీల ముఖ్యనేతలు పాయల్ శంకర్, జోగు రామన్న మధ్య సత్సంబంధాలు ఉన్నాయనడానికి నిదర్శనమని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. ఇక ప్రస్తుతం హస్తం పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కంది శ్రీనివాస రెడ్డి జహీర్ రంజానికి మద్దతుగా కౌన్సిలర్ల బలాన్ని క్రోడీకరించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.మొత్తంగా ఈ వ్యవహారం ముఖ్య నేతలకు ప్రతిష్టాత్మకంగా మారింది.

కొనసాగుతున్న బేరసారాలు..

వైస్ చైర్మన్ జహీర్ రంజాని బీఆర్‌ఎస్ నుంచి గతంలోనే కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు ఆయనపై అవిశ్వాస సమావేశం జరగనుండగా, కొద్ది రోజులుగా అధికార కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలకు చెందిన కౌన్సిలర్లను పార్టీలో చేర్చుకునేందుకు యత్నాలు చేస్తుంది. ఇప్పటికే పలువురు చేరినప్పటికీ ఈ తీర్మానాన్ని వీగేందుకు అనువైన సంఖ్యా బలం ఉందా అనే విషయంలో తర్జనభర్జన పడుతోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ఎత్తుగడ ఏంటా అనేది అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆ పార్టీ కౌన్సిలర్లు ఇప్పటికే క్యాంపులో ఉండగా, వారు గురువారం సమావేశానికి హాజరు కావడం లేదని తెలుస్తోంది. ఎంఐఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందని ముందు నుంచి చెబుతూ వస్తున్నారు. ఇదిలా ఉంటే ఆ పార్టీ గత ఎన్నికల్లో ఐదుగురు కౌన్సిలర్లు గెలవగా, ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ తీరు కూడా ఎలా ఉంటుందనేది ఆసక్తికరం. కాగా కాంగ్రెస్ బుధవారం సాయంత్రం కూడా కొంత మంది కౌన్సిలర్లతో బేరసారాలు జరిపినట్టుగా చర్చ సాగుతుంది. ఇవి కొలిక్కి వచ్చాయా లేదా అనేది తెలియరాలేదు.

చేతులెత్తే విధానంలో..



మున్సిపల్ సమావేశంలో సభ్యులు చేతులెత్తే విధానంలో ఈ ప్రక్రియలో పాల్గొంటారు. 2/3 వంతు సభ్యులు పాల్గొన్నారా.. అందులో అనుకూలం ఎంత మంది, వ్యతిరేకం ఎంత మంది అనేది పరిశీలించడం జరుగుతుంది. దీనికి సంబంధించిన రిపోర్టు కలెక్టర్‌కు అందజేస్తాం. తదనుగుణంగా నిర్ణయం వెల్లడి అవుతుంది.
– వినోద్ కుమార్, ఆర్డీవో, ఆదిలాబాద్

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎంపీ గోడం నగేశ్



మొక్క నాటుతున్న ఎంపీ గోడం నగేశ్

బజార్‌హత్నూర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం తన స్వగ్రామమైన జాతర్లలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అమ్మ పేరుతో మొక్క నాటాలని ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు ఆలయ ఆవరణలో తన మాతృమూర్తి భీంబాయి పేరిట మొక్క నాటారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ వెంకన్న యాదవ్, గణేశ్, శంకర్, రమణ, శంకర్, ఈశ్వర్, నాగోరావ్, భోజారెడ్డి, మారుతి పాల్గొన్నారు.

సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

ఎదులాపురం: రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో బుధవారం ఎంపీ నగేశ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితి రూ.8 లక్షలకు పెంచడం, సీపీఎస్ రద్దు, ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా చట్ట సవరణ, జిల్లాకు సైనిక్ పాఠశాల మంజూరు కోసం బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాలని విన్నవించారు. ఇందులో తపస్ నాయకులు గోపీకృష్ణ, సునీల్ చవాన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ బదిలీలు షురూ

- 10 మంది సూపరింటెండెంట్లకు స్థానచలనం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పరిషత్ పరిధిలోని పంచాయతీరాజ్ శాఖలో పనిచేసే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ షురూవైంది. బుధవారం సెలవు రోజైనప్పటికీ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో ఆమె చాంబర్‌లో ఈ ప్రక్రియ చేపట్టారు. 40శాతం నిబంధనల ప్రకారం 10 మంది సూపరింటెండెంట్లు, ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి స్థానచలనం కల్పించారు. వీరికి ఈ నెల 19న బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఇందులో జెడ్పీ డిప్యూటీ సీఈవో కళిందిని, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సెక్షన్ అసిస్టెంట్ అనిల్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీ అయిన వారి వివరాలు..

సూపరింటెండెంట్లు	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీ ప్రాంతం
యు.చక్రపాణి	ఎంపీపీ, నేరడిగొండ	ఎంపీపీ, ఆదిలాబాద్
ఆర్.పుష్ప	ఎంపీపీ, బజార్‌హత్నూర్	ఎంపీపీ, తాంసి
ఎం.రవీందర్	ఎంపీపీ, తాంసి	ఎంపీపీ, ఇచ్చోడ
ఎల్.నర్సింగ్‌రావు	జెడ్పీపీ, ఆదిలాబాద్	ఎంపీపీ, జైనథ్
కె.శంకర్	ఎంపీపీ, ఆదిలాబాద్	ఎంపీపీ, తలమడుగు
ఎస్.మహేందర్ కుమార్	ఎంపీపీ, బేల	ఎంపీపీ, ఇంద్రవెల్లి
మహ్మద్ జమీల్ అహ్మద్	ఎంపీపీ, తలమడుగు	ఎంపీపీ బేల
సి.వేణు	ఎంపీపీ, ఇంద్రవెల్లి	జెడ్పీపీ ఆదిలాబాద్
సి.ముత్యంరావు	ఎంపీపీ, జైనథ్	ఎంపీపీ, బజార్‌హత్నూర్
ఈ.వెంకటేశ్వర్లు	ఎంపీపీ, ఉట్నూర్	ఎంపీపీ, నేరడిగొండ
సీనియర్ అసిస్టెంట్లు..		
ఎస్.పావని	జెడ్పీపీ,ఆదిలాబాద్	ఎంపీపీ, గుడిహత్నూర్
ఏ.మహిపాల్ రెడ్డి	ఎంపీపీ, బేల	జెడ్పీపీ, ఆదిలాబాద్
డి.గిరీశ్	జెడ్పీపీ, ఆదిలాబాద్	ఎంపీపీ, బేల
ఎ.వెంకట్‌రెడ్డి	జెడ్పీపీ, ఆదిలాబాద్	ఎంపీపీ, నార్నూర్
సీహెచ్.శశిధర్ రాజు	ఎంపీపీ, నార్నూర్	జెడ్పీపీ, ఆదిలాబాద్

రుణమాఫీకి వేళాయె

- అన్నదాతల్లో హర్షం
- నేడు రూ.లక్షలోపు రైతుల ఖాతాల్లో జమ
- రైతు వేదికల్లో సంబరాలకు సిద్ధం
- జిల్లాలో తొలివిడతగా 18,739 మందికి ప్రయోజనం

రూ.లక్ష లోపు రుణమాఫీ అయ్యే రైతుల వివరాలు..

మండలం	రైతుల సంఖ్య
ఆదిలాబాద్‌రూరల్	1,235
ఆదిలాబాద్‌అర్బన్	29
బజార్‌హత్నూర్	1237
బేల	1222
భీంపూర్	732
బోథ్	1905
గాదిగూడ	431
గుడిహత్నూర్	1117
ఇచ్చోడ	1438
ఇంద్రవెల్లి	1224
జైనథ్	2049
మావల	102
నార్నూర్	505
నేరడిగొండ	1221
తాంసి	614
ఉట్నూర్	1546
మొత్తం	18,739



రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. రూ.2లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించడంతో వారిలో హర్షం వ్యక్తమవుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అమలుకు సిద్ధమైంది. మొదటి విడత రూ.1లక్ష లోపు రుణాలు తీసుకున్న వారికి నేటి సాయంత్రం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రైతులు వీక్షించేలా వ్యవసాయ శాఖ అధికారులు ఆయా రైతు వేదికల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. సంబరాలకూ సన్నద్ధమవుతున్నారు. మంత్రులు, ఎంపీ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సీఎం లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

రూ.వంద కోట్లకు పైగా లబ్ధి..

జిల్లాలో లక్ష 47వేల మంది రైతులు ఉన్నారు. వీరిలో లక్ష 17వేలమందికి బ్యాంకు ఖాతాలున్నాయి. దాదాపు రూ.1,030కోట్ల వరకు ఆయా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిలో రూ.800 కోట్లు మాఫీ కానున్నట్లు అంచనా వేస్తున్నారు. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న జిల్లాలోని 18,739 మంది రైతులకు తొలి విడత రుణమాఫీ కానుంది. దాదాపు రూ.100 కోట్లకు పైగా రైతులకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలోని 18 మండలాలకు సంబంధించి గ్రామాల వారీగా రుణమాఫీ అయ్యే రైతుల వివరాలు వ్యవసాయశాఖ అధికారుల వద్ద ఉన్నప్పటికీ ఏ రైతుకు ఎంత మాఫీ అవుతుంది.. మండలంలో ఎంత రుణం మాఫీ అవుతుందనే విషయంపై స్పష్టత లేదు. అలాగే రుణమాఫీకి సంబంధించి తమవద్ద ఎలాంటి సమాచారం లేదని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

పండుగలా రుణమాఫీ సంబరాలు

కైలాస్‌నగర్: జిల్లాలో రుణమాఫీ పొందిన రైతులు ఆయా రైతు వేదికల్లో పండగ వాతావరణంలో సంబరాలు జరుపుకునేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈ మేరకు జిల్లాలోని వ్యవసాయ, విస్తరణ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, బ్యాంకు అధికారులు, సహకార శాఖ అధికారులతో బుధవారం రైతు రుణమాఫీ- 2024 అమలుపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారికి పలు సూచనలు చేశారు. సంబరాలకు సంబంధించి ప్రతి మండలానికి మండల వ్యవసాయ అధికారిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలో రైతులతో ర్యాలీలతో పాటు రైతువేదికలను సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 18,739 మంది ఖాతాల్లోకి జమ..



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి జిల్లాలోని 17 రైతు వేదికల్లో ఏర్పాట్లు చేశాం. కార్యక్రమం ప్రారంభించిన తర్వాత సీఎం లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు. మొదటి విడత రుణమాఫీకి సంబంధించి జిల్లాలో 18,739 మంది రైతులు ఉన్నారు. వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ కానున్నాయి. మిగతా రైతులకు రెండో విడతలో జమ కానున్నాయి.
– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

అందుబాటులో గ్రీవెన్స్ కమిటీ

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో మండలాల వారీగా గ్రీవెన్స్‌కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే మండలాల వారీగా అందుబాటులో ఉండే గ్రీవెన్స్ కమిటీకి నివేదిస్తే నెల వ్యవధిలో సమస్యను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు



పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు, మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. జైనథ్ మండలంలోని గిమ్మ(కె) గ్రామానికి చెందిన మాదాసు సాయి మహారాష్ట్ర నుంచి 12 లీటర్ల ఆరు మద్యం బాటిళ్లను తీసుకొస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

మురళీధర్‌కు వరిష్ట పురస్కారం



అవార్డు అందుకుంటున్న మురళీధర్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పురస్కారాల్లో జిల్లా రచయిత మురళీధర్‌కు వరిష్ట అవార్డు దక్కింది. బుధవారం హైదరాబాద్‌లోని కళా మందిరంలో ఎడ్లూరి శివారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రూ.20వేల నగదు అందజేసి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి జుర్రు చెన్నయ్య, కవి యాఖుబ్, లత, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ఆదిలాబాద్‌రూరల్: హెచ్‌సీఎల్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆదివాసీ విద్యార్థులు ఎంపికయ్యారు. చించుఘాట్ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు పెందూర్ రూప, సిడాం శ్రీజ జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి 26 వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించనున్న జాతీయస్థాయి అర్చరీ పోటీల్లో సదరు విద్యార్థినులు పాల్గొననున్నారు.

ఆ ఒక్కటీ అడక్కు..!

- పుట్టగొడుగుల్లా మ్యారేజ్ బ్యూరోలు
- ఉమ్మడి జిల్లాలో 300 నుంచి 400
- సంబంధాల పేరిట వేలల్లో ఫీజు వసూలు
- జాతకాలు కలవలేదంటూ బుకాయింపు



మంచిర్యాలఅగ్రికల్చర్: ఇటీవల ఓ సినిమాలో మ్యారేజ్ బ్యూరో వాళ్లు అబ్బాయిలకు పెళ్లి సంబంధం చూస్తామని వివిధ స్కీంలలో చేర్పిస్తారు. ఓ అమ్మాయి వెళ్లి అబ్బాయిని కలిసి ఇప్పుడే పెళ్లి ఇష్టం లేదని చెప్పిస్తారు. దీంతో ఆ అబ్బాయిని మరో స్కీంలో చేర్పించి మళ్లీ ఫీజు వసూలు చేస్తారు. ఈ తతంగాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు ఎప్పుడో వంటబట్టించుకున్నారు. యువతుల ఫొటోలు చూపించి మీ ఫొటో, వివరాలు కూడా అమ్మాయి వాళ్లకు నచ్చాయి. మీరు ఫీజు చెల్లించిన తర్వాత సంబంధం మాట్లాడుదాం అంటూ ఫీజు చెల్లించగానే అమ్మాయి తాలూకు బంధువుల, కుటుంబంలో ఎవరో చనిపోయారని, ఇంట్లో వారికి ఆరోగ్యం బాగాలేదని, అమ్మాయి, అబ్బాయి రాశులు, జాతకాలు కలవలేదని, మరో అమ్మాయి చూపిస్తామని బుకాయిస్తున్నారు. ఇలా పెళ్లి కోసం చూస్తున్న అబ్బాయిలను బోల్తా కొట్టిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 300 నుంచి 400 వరకు మ్యారేజ్ బ్యూరోలు ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని కులాలు, ఉద్యోగులు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్, వ్యాపారులకు సంబంధాలు కుదుర్చుతామని, రెండోపెళ్లి సంబంధాలూ చూస్తామని విజిటింగ్ కార్డ్స్, వాల్‌పోస్టర్లు వేస్తున్నారు.

పెట్టుబడి లేని వ్యాపారం

మ్యారేజ్ బ్యూరో అనేది పెట్టుబడి లేని వ్యాపారంలా మారింది. పెళ్లి సంబంధం పేరిట రూ.5వేల నుంచి రూ.25వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉంది. అబ్బాయి పై చదువులు చదివి ఉన్నతోద్యోగం చేస్తున్నా సరైన సంబంధం దొరకడం కష్టంగా మారింది. వధువు కోసం వెతుకుతున్న యువకుల కుటుంబ సభ్యులు మ్యారేజ్ బ్యూరోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో అబ్బాయి చదువు, కుటుంబ నేపథ్యం, పుట్టిన తేదీ తదితర వివరాలు సేకరిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో అమ్మాయిల ఫొటోలు చూపించి తప్పుడు అడ్రస్ చెబుతున్నారు. అమ్మాయిల ఫొటోలు చూపించి రూ.10వేలు ఫీజు చెల్లించండి అమ్మాయి వాళ్లతో సంబంధం మాట్లాడుతాం అంటూ వసూలు చేస్తున్నారు. డబ్బు చెల్లించిన తర్వాత పెళ్లి సంబంధం కుదర్చడంలో దాట వేస్తున్నారు. 'ఫీజు చెల్లించిన తర్వాత ఫొటో చూపించి అమ్మాయి వాళ్ల బంధువులు చనిపోయారని, అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో ఉన్నారని, అమ్మాయి, అబ్బాయి జాతకం కలవడం లేదని చెబుతున్నారు..' అంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ యువకుడు వాపోయాడు. పట్టణాల్లోని మ్యారేజ్‌బ్యూరోల సంస్కృతి గ్రామాలకూ విస్తరించింది. వధువుల కోసం వెతుకుతున్న వారు ఎక్కువగా ఉండడంతో పెళ్లి సంబంధాలు చూస్తామని తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తున్న వారి సంఖ్య పెరిగింది. ఏ సామాజిక వర్గమైనా మొదటి, రెండో పెళ్లి సంబంధం కుదుర్చుతామని నమ్మబలుకుతున్నారు. కొన్ని కుటుంబాల్లో ఆర్థికంగా బాగానే ఉన్నా ఉద్యోగం లేదని అమ్మాయిని ఇవ్వడం లేదు. కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిల సంఖ్య గణనీయంగా తగ్గడంతో యువకులకు 35ఏళ్లు దాటినా పెళ్లి కాని పరిస్థితి నెలకొంది. దీంతో ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకునేందుకూ కొందరు వెనుకాడడం లేదు. ఇలా పెళ్లి కుదిర్చిన మ్యారేజ్‌బ్యూరోలో రూ.లక్షల్లోనే ఫీజులు వసూలు చేస్తున్నారు. సామాజిక వర్గం పట్టింపు లేదని, ఆర్థికంగా ఉన్నతస్థాయిలో ఉన్న అబ్బాయికి పేదింటి అమ్మాయి సంబంధం కుదిర్చితే గంపగుత్తగా రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. కొందరు దీన్ని ఆసరాగా చేసుకుని అమ్మాయి, అబ్బాయి వివరాలు, కుటుంబ నేపథ్యం తెలుసుకోకపోవడం వల్ల గొడవలకు దారి తీసి పోలీసు, కోర్టు కేసుల వరకు వెళ్లి విడాకులకు దారి తీస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ లేకుండానే..

మ్యారేజ్ బ్యూరో నిర్వహణకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రిజిస్ట్రేషన్, వెల్ఫేర్ కార్యాలయంలోనే ఉంది. ఉమ్మడి జిల్లాలో 90శాతం ఎలాంటి అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండానే బ్యూరోలను నిర్వహిస్తున్నారు.

మూడు ముళ్ల బంధం.. మూడు నెలలే..

- హైదరాబాద్ వ్యాపార కుటుంబానికి చెందిన అబ్బాయికి బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అమ్మాయికి ఎనిమిది నెలల క్రితం మ్యారేజ్‌బ్యూరో ద్వారా సంబంధం కుదిర్చారు. సామాజిక వర్గాలు వేరైనా కట్నం లేకుండా అమ్మాయిపైనే ఆభరణలు వేసుకుని పెళ్లి చేసుకున్నారు. ఈ సంబంధం కుదిర్చిన మ్యారేజ్‌బ్యూరో రూ.2లక్షల వరకు డిమాండ్ చేశారు. అబ్బాయి కుటుంబానికి సంబంధించి నిజానిజాలు తెలియకపోవడంతో కొన్ని నెలల్లోనే గొడవల కారణంగా పోలీసుస్టేషన్ వరకు వెళ్లినట్లు తెలిసింది.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఓ మండలానికి చెందిన అమ్మాయి మహారాష్ట్రలోని ఓ అబ్బాయికి మ్యారేజ్ బ్యూరో ద్వారా పెళ్లి సంబంధం కుదిర్చారు. అప్పటికే ఆ అబ్బాయికి పెళ్లి అయి పిల్లలూ ఉండడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి.

ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ అరెస్ట్

తానూరు : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. ఈ నెల 12న ముధోల్ మండలం తరోడా నుంచి తానూరు మండలం బెంబరకు ఇటుకలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ హంగిర్గా సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న యాతలం గంగారెడ్డిని దాటే క్రమంలో అదుపుతప్పి వెనుక టైరు కిందపడి మృతి చెందాడు. వివరాలు సేకరించిన పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్ సునీల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు గురువారం వెల్లడిస్తామన్నారు.

వైన్స్‌లో చోరీ



సగం వరకు తెరిచి ఉన్న షటర్

దిలావర్‌పూర్: సిర్గాపూర్‌లోని సాయిలక్ష్మి వైన్స్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం షటర్ పైకి లేపి ఉంచడాన్ని గమనించిన గ్రామానికి చెందిన పలువురు వాహన చోదకులు సదరు వైన్స్ యజమానులకు సమాచారం అందించారు. వైన్స్ నిర్వాహకుడు గౌస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు పరిశీలించిన షాపు నిర్వాహకులు ముసుగు ధరించిన వ్యక్తులు లోనికి చొరబడినట్లు గుర్తించారు. వైన్స్‌లోని రూ.20వేలకు పైగా నగదు చోరీకి గురైనట్లు తెలిపారు.

పొలంలో బయటపడ్డ విగ్రహాలు



విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

దస్తురాబాద్: పంటపొలంలో దేవుని విగ్రహాలు బయట పడిన సంఘటన బుధవారం మండలంలోని రేవోజీపేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రేవోజీపేటకు చెందిన కోల మహేష్ తన పొలాన్ని రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌తో దున్నుతుండగా నాగలికి విగ్రహాలు తగిలి బయటకు వచ్చాయి. ట్రాక్టర్ డ్రైవర్ వాటిని గమనించకుండానే వెళ్లిపోయాడు. అటుగా వెళ్లిన గొర్రెల కాపరికి నంది విగ్రహం కనిపించడంతో యజమానికి సమాచారం అందించాడు. అతని ద్వారా ఒగ్గు పూజారులకు విషయం తెలియజేయడంతో గ్రామస్తులంతా కలిసి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి నంది విగ్రహాన్ని భూమిలోంచి బయటకు తీస్తుండగా శివలింగం విగ్రహం కనిపించింది. దీంతో రెండు విగ్రహాలను బయటకు తీసి సంప్రోక్షణ పూజలు చేశారు. విషయం తెలిసిన గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు చేశారు.

రెండు బంగారం దుకాణాల్లో చోరీ



దుకాణంలో పరిశీలిస్తున్న ఏఎస్పీ

భైంసాటౌన్: పట్టణంలోని రెండు స్వర్ణకార దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. పద్మావతి కాలనీలో కే సంతోష్‌తో పాటు అర్కోజు రాజుకు చెందిన దుకాణాల్లో రాత్రి 2:40 గంటల ప్రాంతంలో ముగ్గురు గుర్తు తెలియని దొంగలు షటర్ తాళాలు పగులగొట్టి లోనికి చొరబడిన దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. సంతోష్ దుకాణంలో 9 కిలోల వెండి, కొంత నగదు, రాజు దుకాణంలో 12.9 తులాల బంగారం, కొంత నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా షటర్ తాళాలు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐ డి.రాజారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం అధికారి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా పట్టణంలో భారీగా పోలీసు బందోబస్తు ఉన్నా తరచూ చోరీ ఘటనలు జరుగుతుండడం పట్టణ వాసులను కలవరపెడుతోంది.

విధుల్లో ఉన్న పోలీసులపై దాడి

ఎదులాపురం: విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేసిన సంఘటన టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కొలిపూరకు చెందిన సాయికుమార్, నవీన్ మంగళవారం రాత్రి రిమ్స్‌కు వెళ్లి బైక్ పార్కింగ్ చేస్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అటుగా పార్కింగ్ చేయాలని సూచించగా వారితో గొడవకు దిగారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ భూమన్న, హోంగార్డు రవీందర్‌రెడ్డి విషయం తెలుసుకునేందుకు వెళ్లగా వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు టుటౌన్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి బుధవారం బోథ్ మెజిస్ట్రేట్ ఎదుట ప్రవేశ పెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు.

రూ.11.22 లక్షల విలువైన గుట్కా పట్టివేత



ఆటోను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాంకిడి: రూ.11.22 లక్షల విలువ గల నిషేధిత గుట్కా పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన షాహిద్ ఆటో ట్రాలీలో మంగళవారం రాత్రి మహారాష్ట్ర వైపు నుంచి వాంకిడికి వస్తుండగా జాతీయ రహదారి- 363పై పోలీసులు తనిఖీ చేశారు. ట్రాలీలో 30 బ్యాగులు ఉండగా ఒక్కోదాంట్లో 40 మాజా(నిషేధిత పొగాకు) డబ్బాలు ఉన్నట్లు తెలిపారు. బ్యాగులను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి, హెడ్‌కానిస్టేబుల్ శ్యాంరావు, కానిస్టేబుల్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నెలకో పుట్టిన రోజు..



విభిన్నరకాల డెకరేషన్ల మధ్యన పుట్టినరోజు వేడుకలు (ఫైల్)

- చిన్నారులకు నెలనెలా బర్త్‌డే సంబరాలు
- ఇంటింటా ఆనందాల హరివిల్లులు
- జిల్లాలో విస్తరిస్తున్న సరికొత్త పంథా..

నిర్మల్‌ఖిల్లా: ప్రతీఇంట్లో చిన్నారి శిశువు జన్మించిందంటే చాలు.. ఆ ఇంట్లో ఇక ఆనందాల పండుగే.. ఇక తమ ఇంట్లోకి కొత్త వ్యక్తిని ఆహ్వానిస్తూ చేసే పండుగలు తొలిసారి ఉయ్యాల వేడుక, నామకరణ మహోత్సవాలు. వీటికి అదనంగా ఇటీవల నూతన సంస్కృతి విస్తరిస్తూ వస్తోంది. తమ కుటుంబంలోకి నూతనంగా విచ్చేసిన ఆ శిశువుకు తన పుట్టిన తేదీన ఏడాది పాటు ప్రతీనెల సంబరాలు జరుపుతున్నారు. ఈ సరికొత్తపంథా ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాలలో మొదలుకాగా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోకి సైతం విస్తరిస్తోంది. హంగు ఆర్భాటంతో ప్రతి నెల పుట్టిన తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఖర్చులకు కూడా వెనుకాడటం లేదు. వివాహం చేసుకున్న నవదంపతులు పెళ్లయిన ఏడాది రెండేళ్లకే తమ జీవితంలోకి నూతన కుటుంబ సభ్యుడైన చిన్నారి శిశువును ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు.

వినూత్నంగా వేడుకలు..

శిశువు వయసు ప్రకారం ప్రతి నెల పుట్టిన రోజు వేడుకలు జరుపుతుండగా పుట్టి ఒక నెల రోజులు పూర్తయితే మొదటి నంబర్ సంఖ్యతో.. రెండు నెలలు పూర్తయితే రెండో నంబర్ సంఖ్యతో అలా 12 నెలల వరకు ప్రతీనెల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలో వినూత్న రీతిలో వివిధ రకాల వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కూరగాయలు, పండ్లు, దేవుని చిత్రపటాలతో అలంకరణ చేస్తున్నారు. వాటిని ప్రత్యేక ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫరుతో ఫొటోలు, వీడియోలను తీయించుకుంటూ తీపి గుర్తులుగా భద్రపరుచుకుంటున్నారు.

ప్రత్యేకంగా స్టూడియోలు...

చిన్నారుల నెలవారి పుట్టినరోజు వేడుకల నిర్వహణకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడంతో జిల్లా కేంద్రాలు, పట్టణాలలో నూతనంగా స్టూడియోలు ఏర్పాటవుతున్నాయి. నిర్మల్‌లో విభిన్న రకాల డిజైన్లతో కూడిన సెట్టింగ్‌లను ప్రత్యేకంగా వేయించి అద్దెకు ఇస్తున్నారు. కొంత మొత్తంలో డబ్బు చెల్లించిన తల్లిదండ్రులు తమ చిన్నారుల నెలవారి పుట్టినరోజు వేడుకలను ఈ స్టూడియోలో నిర్వహిస్తూ ఫొటోలు, వీడియోలు తీసుకునే సౌకర్యం కల్పిస్తున్నారు. తల్లిదండ్రుల అభిరుచికి అనుగుణంగా స్టూడియో ఏర్పాటు చేసినట్లు నిర్మల్‌లోని ఓ స్టూడియో నిర్వాహకుడు కాంద్రే రామరాజ్ తెలిపారు.

నెలనెలా వేడుకలు నిర్వహించాం



మా బాబు వయసు ప్రస్తుతం ఏడాది. పుట్టినప్పటి నుండి ప్రతినెలా పుట్టినతేదీ ప్రకారం వేడుకలు నిర్వహించాం. ప్రత్యేకంగా అలంకరించిన డిజైన్ల మధ్య మా బాబుని ఉంచి ఫొటోలు, వీడియోలు తీస్తున్నాం. వాటిని మావాడు పెద్దయిన తర్వాత చూసి మురిసిపోయేలా భద్రపరుచుకుంటున్నాం.

– కొట్ల మమత, సురేశ్, చించోలి (బీ)

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడు మృతి



బ్రహ్మరెడ్డి (ఫైల్)

జైపూర్: మండల కేంద్రంలోని వెలిశాల మల్లన్నస్వామి ఆలయ సమీపంలో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సూరం బ్రహ్మరెడ్డి (58) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. చెన్నూర్ పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన బ్రహ్మరెడ్డి ఆర్కే6 గనిలో కోల్‌కట్టర్‌గా పని చేస్తున్నారు. 11న మధ్యాహ్నం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా చెన్నూర్ వైపు నుంచి శ్రీరాంపూర్ వెళ్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో ముందుగా రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ముస్తాఖ్ అదృశ్యమైనట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రోజులాగే ముస్తాఖ్ మంగళవారం ఉదయం తన ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. రాత్రి వరకు కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా ఆచూకీ లభించలేదు. బుధవారం ముస్తాఖ్ భార్య ఆయేషా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వ్యాపారి ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని అంగడిబజార్‌కు చెందిన ప్రతాప్ (55) పాత బస్టాండ్ ప్రాంతంలో స్టీల్ బోల్ల దుకాణం నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కొంతకాలంగా వ్యాపారం సరిగా నడవకపోవడంతో అప్పులు చేసి ముగ్గురు స్నేహితులతో కలిసి వేరే వ్యాపారంలో పెట్టుబడి పెట్టి నష్టాలపాలయ్యాడు. అప్పులు చెల్లించే మార్గం తెలియక మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



కొమ్ములు, తోక విరిగిపోయిన అడవి దున్న

నాడు ఆకర్షణీయం..

నేడు అధ్వానం



వీపు భాగం పగిలిపోయిన దున్న

పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యాటకులకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో మావల మండల కేంద్రంలోని అటవీ ప్రాంతంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో కోట్ల రూపాయలు వెచ్చించి హరితవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా అడవి దున్న ప్రతిమను ప్రతిష్టించారు. అయితే నిర్వహణ, పర్యవేక్షణలోపంతో అడవి దున్న కొమ్ములు, తోక తెగిపోగా వీపుభాగం పగిలిపోయి అధ్వానంగా మారింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్